# మానవత్వమా నీవెక్కడ

చీకటి చీర విప్పుకుని ఆకాశం అంతా ఆరేసినట్టు దట్టంగా నల్లని మేఘాలు గగన వీధిని ఆవరించుకున్నాయి. ఉన్నట్టుండి ఫెళ ఫెళ మంటున్న ఉరుములు నాలో ఉలికిపాటుని కలుగ జేస్తున్నాయి. రివ్వున వీస్తున్న గాలి కిటికీ పరదా లతో ఆడుకుంటోంది. ఇంతలో కరంటు పోయింది.

కొవ్వొత్తి చేత బట్టుకుని అగ్గిపెట్టె కోసం వంట గదిలోకి వెళ్ళిన నాకు ఏదో మూలుగు అస్పష్టంగా వినిపించింది. ఈసారి పరికించి విన్నాను. అది మూలుగు కాదు. ఎవరో సన్నగా ఏడుస్తున్న శబ్దం.

ప్రస్తుతానికి నేను తప్ప ఇంట్లో ఎవ్వరూ లేరు. ఇంటి ఆవరణలోనే మూలగా చిన్న గుడిసె వేసుకుని వాచ్‌మాన్ ఉంటున్నాడు. మరి ఈ రోదన తాలూకు శబ్దం అతనిది కాదు అని తెలుస్తూనే వుంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. నేను ఇక్కడ నుండే 'రాములూ' అని పిలిచినా అతనికి వినబడక పోవచ్చు. ఇంతలో లైట్లు వెలిగాయి. అగ్గిపెట్టె తీసికుని ఇవతలికి వచ్చాను.

"రాములూ! రాములూ!" గుడిసె దగ్గరగా వెళ్ళి పిలిచాను.

"ఏంది సార్" బైటకొచ్చాడు.

పరిస్థితి చెప్పాను.

టార్చిలైటు వేసుకుని ఇద్దరం ఇంటి వెనక వైపుగా వెళ్ళాం. అక్కడ... ఆ మూల... ఆ చెట్టు మొదట్లో... ఆ దృశ్యం చూసేసరికి అవాక్కయ్యాను. ఎలా చేరిందో తెలీదు. ఒక కుక్క అక్కడ ముందటి కాళ్ళతో గొయ్యి తవ్వు తూ చిన్నగా మూలుగుతోంది. పొట్ట బరువుగా వేలాడుతోంది.

"ఏం లేదు సార్! పాపం పిల్లల్ని కనడానికి గొయ్యి తవ్వుతోందంతే. నేను చూసుకుం టాలే. మీరు వెళ్ళండిసార్" రాములు చెప్పగానే నేను ఇంట్లోకి వచ్చేసాను.

బెడ్ రూంకెళ్ళి పడుకున్నానన్న మాటే గానీ నిద్ర రావడం లేదు. తెల్లవారితే ఊరు ప్రయాణం. త్వరగా నిద్ర లేవాలంటే ఇప్పుడు నిద్రపోతే గానీ కుదరదు. నేను రాసిన కథ ఉత్తమ కథగా ఎన్నికయ్యింది. విజయవాడలో పత్రికల వారూ, నా అభిమాన పాఠకులూ సన్మాన సభ ఏర్పాటు చేసారు. రేపు పొద్దున్నే బయలు దేరితే గానీ సాయంత్రంకల్లా అక్కడికి చేరుకోలేను.

"ప్చ్!!" ఎంత ప్రయత్నించినా నిద్ర రావడం లేదు. రాను రానూ మూల్గుతున్న శబ్దం, ఏడుస్తున్న శబ్దం ఎక్కువ అవ్వసాగింది. అసహనంగా పక్క మీద అటూ ఇటూ కదిలాడు. లేచి చలం 'మైదానం' తీసి చదవడం మొదలుపెట్టాను. ఏడుపు అంతకంతకు ఎక్కువ అవుతోంది.

"ఛీ!ఛీ!!" దీని మూలంగా నిద్ర రావడం లేదు. వయసు ఒక్కదానిమీద లగ్నం కావడం లేదు. మళ్ళీ వెళ్ళి రాముల్ని పిలిచాను.

"ఆ కుక్కని తరిమేయి వెధవ న్యూసెన్స్‌కి తయారయ్యింది. నిద్రకూడా పట్టడం లేదు" రాముల్ని తోడు తీసుకుని అక్కడికి వెళ్ళాను.

"హుష్ష్! హై... హై..." కర్రతో అదిలించాడు రాములు. అప్పటికే ఓ మోస్తరు గొయ్యి తవ్వింది కుక్క.

"గుర్ర్‌ర్ర్‌ర్ర్..." అంటూ లేచింది. మీదకు దూకి కరుస్తా అన్నట్టు సగం లేచి కూర్చుంది.

"లాభం లేదు సారు... వదిలేయండి" అంటూ నిష్క్రమించాడు రాములు.

నేను వెంటనే ఒకరాయి తీసి దాని మీదికి విసిరాను.

అది అవస్త పడుతూనే లేచి "భౌ!భౌ!!" అంటూ ముందుకి దూకబోయి ఒక్కసారిగా "కుయ్యో!"మంటూ బాధగా సగం దారిలోనే చతికిలపడింది. నేను ఒక్క పరుగులో ఇంట్లో కొచ్చి గడియ వేసాను.

కొంతసేపటికి వాన వెలిసింది. కుక్క ఏడుపు కూడా ఆగిపోయింది. కిటికీ తెరచి చూసాను. చెట్టుకింద గొయ్యి సగం వరకు వాన నీరు నిలిచి ఉంది. అంటే కుక్క వెళ్ళి చాలా సేపే అయ్యిందన్నమాట!

మళ్ళీ బెడ్‌పై వాలి మైదానం తిరగేయ సాగాను.

నిద్రాదేవి ఎప్పుడు నా పక్కలో చేరిందో తెలీదు.

★ ★ ★

తలుపులు దబదబా బాదుతున్న శబ్దానికి మెలుకువ వచ్చింది. తలుపు తీసాను. ఎదురుగా పనిపిల్ల లచ్చి, తొమ్మిదేళ్ళు ఉంటాయేమో! బొద్దుగా ఆరోగ్యంగా ఉంది. మా ఇంటి ఎదురుగా ఉన్న పూరి గుడిసే దాని ఇల్లు. టైం చూసి అదిరి పడ్డాను. ఏడున్నర కావస్తోంది. టైం లేదు. త్వరగా రెడీ అవ్వాలి అనుకుంటూ కాలకృత్యాలకి ఉపక్రమించాను. నేను రెడీ అయి బైట పడేలోగా ఇల్లు ఊడ్చి వాకిట నీళ్ళు చల్లి ముగ్గువేసింది. తాళం వేసి నెల జీతం లచ్చికి ఇస్తుండగా దాని తమ్ముడు రివ్వున దూసుకు వచ్చాడు.

"అక్కా! రాత్రి మన ఇంటికొచ్చిన కుక్కకి ఐదు బుల్లి బుల్లి కుక్కలు పుట్టినాయే!" రొప్పుతూ చెప్పాడు.

"ఓలమ్మో! నేను సూడనే లేదే! నే పోతున్నా అయ్యగారో" నేను ఇవ్వబోయే డబ్బు లాక్కున్నట్టుగా తీసుకుని వచ్చినంత వేగంగానూ వెళ్ళిపోయారు అక్కా తమ్ముడూ.

★ ★ ★

ప్రియమైన అభిమానుల్లారా! 'జ్వాల' అన్న కలం పేరుతో రచనలు చేస్తున్న రచయిత శ్రీ శేఖర్ గారికి 'ప్రత్యూష' పత్రిక నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతి రావడం ఈ సందర్భంగా ఆయనని సన్మానించడం నిజంగా మన అదృష్టం అని చెప్పవచ్చు."

మన సమాజంలో జరుగుతున్న అన్యాయ అక్రమాలని తన చిన్న కలంతో వెలికి తీసి బడుగు ప్రజల బాధాకర అజ్ఞాన అంధకార జీవితానికి అద్దం పడుతూ మానవత్వాన్ని పెంపొందించే రచనలు చేయడంలో ఆయనది అందె వేసిన చెయ్యి.

"ఇప్పుడు రచయిత శ్రీ శేఖర్ గారిని వేదిక

వి. ఎల్. వి భారతి



పైకి వచ్చి వారి అమూల్యమైన ప్రసంగాన్ని అందించవలసిందిగా కోరుతున్నాను'' అధ్యక్షుల వారు చెప్పడంతో— నా అభిమానులకి కృతజ్ఞత తెలుపుతూ నా ప్రసంగాన్ని మొదలు పెట్టాను.

''మనిషికీ, మనిషికీ, మనసుకీ, మనసుకీ మధ్య చక్కని అవగాహన ఉండాలి. కానీ నేటి ప్రజలలో వారిలో వారికి, ఏదో తెలియని సంఘర్షణ చెలరేగుతోంది. మానవత చీకటి ముసుగు వేసుకుని వెలుగు నుండి పారిపోయి అరాచకమనే దుప్పటిలో దూరిపోయింది. మనిషికీ, మనిషికీ మధ్య ఏదో తెలియని అగాధం అంతటి అంతరాలు ఏర్పడుతున్నాయి.''

''జీవితమనే పరుగు పందెంలో గమ్యమేదో తెలియకుండానే ప్రతి ఒక్కరూ పరుగెడుతున్నారు. ఆ పందెంలో ధనిక వర్గం వారు పేద ప్రజల్ని మరింత అణగద్రొక్కుతున్నారు. 'మని కి కరంటు పోయినా పక్కింటి వాళ్ళకి కూడా పోయిందో లేదో చూసి తృప్తి పడే' మనస్తత్వం ప్రతి ఒక్కరిలోనూ బలంగా పేర్కొని పోయింది.

''ఆకాశంలో విహరించే ధరలు ఆకలితో దారి తప్పిన ధర్మాన్ని పరిహసిస్తున్న ఈ రోజుల్లో, సహనాన్ని సంహరించి శాంతిని సమిధంగా చేసి ధర్మాన్ని దగ్ధం చేసే ఈ రోజుల్లో, నీతిని నేల రాసి అవినీతి అందలమెక్కే ఈ రోజుల్లో, మానవత్వాన్ని మంట కలిపి కర్కశత్వం కత్తులు దూసే కఠినంగా కరుణ కంఠాన్ని కత్తిరించే ఈ తరుణంలో... అజ్ఞానపు సుడిగాలికి ఆరిపోకుండా కసీ, కష్టాకావేశాల జడివానకి తడిసి పోకుండా మానవతా దీపాన్ని నిలిపేందుకై నా రెండు చేతులనూ అడ్డుగా ఉంచే నా ఈ చిన్ని ప్రయత్నమే నాకలం నుండి జాలువారిక 'మానవతా మేలుకో' అన్నకథ.''

నేను చెప్పిన ఈ చివరి పలుకులకి సభ అంతా చప్పట్లతో మార్మ్రోగింది.

''పోటీలో గెలుపొంది, ప్రథమ బహుమతి పొందడంతో నాకూ, సభలో పాల్గొని ఆనందంతో చప్పట్లు కొట్టడంతో మీకూ బాధ్యత తీరిపోదు. సమ సమాజానికి పునాది వేయడానికై యువతరం నాంది పలకాలి. దీనికై మనతోటి వారిని ప్రోత్సహించాలి. ప్రజలని ఉత్తేజితులను గావిం

వాలి. సమానత్వం కృష్ణ పక్ష చంద్రుడిలా వృద్ధి పొందుతూ మానవతా వెన్నెలని వెదజల్లుతూ వెల్లివిరియాలి. అప్పుడే ప్రజలంతా తరతమ భేధాలు మరిచి ఆదర్శవంతమైన జీవనం సాగిస్తారు. అదే నా ఆశయం! నా కంఠంలో కొన ఊపిరి ఉండేంత వరకూ దీనికై నిరంతరం నా శయశక్తులా కృషి చేస్తానని మనవి చేస్తున్నాను.''

మళ్లీ సభ అంతా చప్పట్లతో హుషారెక్కిపోయింది.

ప్రసంగం ముగించి నా స్థానంలో కూర్చున్నాను.

తర్వాత కార్యక్రమాలు వరుసగా చకచకా జరిగిపోయాయి.

మంచి ఖరీదైన శాలువా కప్పి నన్ను సత్కరించడమూ ఐదువేల రూపాయల చెక్కు బహుమతిగా ఇవ్వడము అయ్యాక అందరి దగ్గరా వీడ్కోలు తీసుకున్నాను ఆనందంగా!

★ ★ ★

ఆటో ఫేర్ చెల్లించి తాళం తీసి ఇంట్లో అడుగు పెట్టాను. ఇప్పుడు నా మనసెంతో హాయిగా, ప్రశాంతంగా ఉంది. ఇటీవల చిన్న చిన్న రచనలు చేస్తున్న నాకు 'మానవతా మేలుకో' కథ ఇంత మంచి పేరు ప్రతిష్టలని, రచయితగా నాకొక స్థాయిని, మంచి గుర్తింపునీ తెచ్చి పెట్టింది.

ఆ సాయంత్రం లచ్చి వచ్చింది.

''అయ్యగారూ... ఇయ్యాల నాకు రెండు రూపాయలు ఇవ్వాలి'' నసుగుతూ చిన్నగా అడిగింది.

ఎందుకే మొన్నేగా' ఊరికి వెళ్తానే నీ ఇరవై ఐదు రూపాయల జీతం ఇచ్చాను. అప్పుడే ఎందుకు కావాల్సి వచ్చిందీ?''

''మారేమోనండీ... ఆయేల నా అయ్య నా జీతం గుంజుకుని కల్లు పాకకి ఎల్లి పోనాడండి. మరి... ఇప్పుడేమో నాకు రెండు రూపాయలు అవసరమొచ్చింది.

''సర్లే! చూద్దాంలే' ముందు పనికానియ్యి!'' అంటూ న్యూస్ పేపర్ చదవడంలో మునిగిపోయాను.

ఏదో భళ్ళుమని పగలడం, 'అబ్బా' అన్న కేక వినబడి వంటదగిలోకి వెళ్ళాను. గాజుగ్లాసు నేల మీద పడి బద్దలయ్యింది. ఒక ముక్క లచ్చి కాల్లో గుచ్చుకుని రక్తం కారుతోంది.

గ్లాసు పగిలినందుకు నేను తిడతాననేమో, 'పం! బిత్తర చూపులు చూస్తోంది. పిచ్చిది! పరేలే' ఇవ్వాల్టికి పని ఆపి ముందు డాక్టరు దగ్గరకు వెళ్ళి మందు వేయించుకో! నిర్లక్ష్యం చేయకు'' అంటూ ఐదు రూపాయలు చేతిలో పెట్టాను. అంతే' అప్పటిదాకా దాని మొహంలో ఉన్న దిగులు మాయం అయి ఏదో హుషారు వచ్చేసింది. గాజు పెంకులు ఏరి పారేసి ఊడ్చి శుభ్రం చేసి కుంటి నడకతోనే వేగాన్ని పెంచి ఆనందంగా అక్కడి నుండి జారుకుంది.

కొంతసేపటికి పని మీద బైటికి వెళ్దామని గేటు వేసి బైటికి వచ్చిన నాకు ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యపోయాను.

అక్కడ లచ్చి! ''తాగండే బుజ్జి ముండల్లారా! తాగండి!! నిన్నటి పంది ఆకలితో నకనకలాడి 'కుయ్యో! కుయ్యో!!'మని ఏడుస్తున్రు. మరి నిన్న కుక్కల బండి వచ్చినోల్లు వచ్చి మీ అమ్మని తోలుకుపోయిన్రు. పాపం! మీ ఆకలెట్టా తీరుద్దీ? అయ్యగారి నడిగి ఐదు రూపాయలట్టుకొచ్చి రత్తమ్మత్త కాడ పాలుకొన్నా!''

కల్లు పాక నుండి అయ్యారాక ముందే తాగండెహె! లేకుంటే 'కుక్కలకి పాలు పోస్తున్నావా' అని నన్ను సావగొట్టాడు.'' అంటూ బుజ్జగిస్తూ పాలు పోస్తోంది. ఐదు కుక్క పిల్లలకి. నేను అక్కడే నిలబడిపోయి లచ్చి కేసే ప్రశంసగా చూడ సాగేను. కాలుకి మందు వేయించుకోలేదు. రక్తం చారికలు అలాగే ఉన్నాయి. కుక్క పిల్లలు పాలు తాగడం అయిపోయింది. ఇంతలో దాని తమ్ముడు వచ్చాడక్కడికి.

ఇద్దరూ కుక్క పిల్లల్ని ఎత్తుకుని ఏదో ముద్దు మాటలతో బుజ్జగిస్తున్న ఆ దృశ్యాన్ని ఒక అపురూపమైన అద్భుతాన్ని చూస్తున్నట్టు చూడ సాగేను.

హఠాత్తుగా నాకు ఆ రోజు చేసిన పని గుర్తుకు వచ్చి సిగ్గుపడ్డాను. బరువుగా వేలాడుతున్న పొట్టతో, ప్రసవ వేదన పడుతూ, ఆశ్రయం కోరి వచ్చి గొయ్యి తవ్వుతున్న తల్లి కుక్కని రాయితో కొట్టి తరిమి వేసాను.

మానవతా వాదిగా, మంచి రచయితగా పేరు వచ్చిందని గర్వపడుతున్న నాకు నా మనసులో ఏపాటి మానవత్వం ఉందో తెలిసిపోయింది. అప్రయత్నంగా ఆర్ద్రత చెందిన నా కళ్ళకి 'అమాయకత్వం' పసితనంకల్లి బోసుకున్న ఆ చిన్నారుల మొహం అస్పష్టంగా కనిపించినా వారి మొహంలో కదలాడే అనంతమైన తృప్తీ, వారి కన్నుల్లో మెరుపూ నా మనసుకి తెలుస్తూనే ఉంది.

''ఎన్ని కథలు రాసినా ఎన్ని బహుమతులు పొందినా, ఎన్ని సన్మానాలు అందుకున్నా, అంతటి తృప్తి నువ్వు పొందగలవా'?? నా మనసు నాకే వేస్తున్న ప్రశ్నకి నేనేమి సమాధానం ఇవ్వగలను?

